ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



హైదరాబాద్

నగర వార్తలు

శనివారం 9 ఆగస్టు 2025



446 మంది పోలీసు సిబ్బందికి రివార్డులు

6

కణాల పునరుత్పత్తి పరిశోధనలో ముందడుగు



మల్కం చెరువు పరిసరాలను పరిశీలిస్తోన్న రంగనాథ్

అవుట్‌లెట్ లేక ఆగమాగం

- పాత ముంబై రహదారిని ముంచెత్తిన వర్షపు నీరు
- మల్కం చెరువు నుంచి దిగువకు నీరు వెళ్లలేని దుస్థితి
- క్షేత్రస్థాయి పరిశీలన.. సమస్యను గుర్తించిన అధికారులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం కురిసిన కుండపోత వర్షానికి ఐటీ కారిడార్ స్తంభించింది. మల్కంచెరువు ఉప్పొంగడంతో రాయదుర్గం- గచ్చిబౌలి మార్గంలోని పాత ముంబై రహదారిపై భారీగా వరద నీరు చేరింది. దీంతో కిలోమీటర్ల మేర ఆ మార్గంలో వాహనాలు బారులు తీరాయి. వర్షం తీవ్రత రాత్రి 7.30 గంటలకే తగ్గినా.. అర్ధరాత్రి వరకు అక్కడ ఇబ్బందులు తప్పలేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆ ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. వరద ముంపునకు కారణాలను ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులను అడిగి తెల్సుకున్నారు. 'ఎగువ ప్రాంతాల నుంచి చెరువులోకి భారీగా వరద నీరు వస్తోంది. ఆ స్థాయిలో దిగువకు నీరు(అవుట్‌లెట్) వెళ్లే పరిస్థితి లేదు. కేవలం అలుగు

మిగతా 8వ పేజీలో..

కొత్త కోచ్‌లు ఎప్పుడు..?

మెట్రో రైళ్లలో అదనపు బోగీలు కరువు

- పెంచుతామని గతంలోనే ఎల్అండ్‌టీ ప్రకటన
- రెండేళ్లుగా తప్పని ఎదురుచూపులు..!
- భారీ వర్షాలు కురిస్తే బోగీల్లో భారీ రద్దీ
- కిక్కిరిసిన ప్రయాణాలతో ఇక్కట్లు



అమీర్‌పేట మెట్రో స్టేషన్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు (ఫైల్)

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలుకు కోచ్‌ల పెంపుపై ప్రయాణికులకు ఎదురు చూపులు తప్పడం లేదు. కోచ్‌ల పెంపు ఉండబోతోందని ఎల్అండ్‌టీ అధికారులు రెండేళ్ల క్రితం ప్రకటించినా నేటికీ ఎటువంటి స్పందనా లేకపోవడంతో రద్దీ సమయాల్లో, వర్షాలు పడిన వేళల్లో ప్రయాణికుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. గ్రేటర్‌లో మూడు కారిడార్లలో మెట్రో రోజుకు 1,075 ట్రిప్పులను నడిపిస్తుండగా.. 4.80 లక్షల నుంచి 5 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. ప్రధానంగా ఎల్బీనగర్-మియాపూర్, నాగోల్- రాయదుర్గం కారిడార్లలో ఉదయం 8 నుంచి రాత్రి 11 గంటల వరకు బోగీలు కిటకిటలాడుతున్నాయి. వర్షాలు పడిన సమయంలో అయితే మరీ రద్దీగా ఉంటున్నాయి. రైళ్లకు మూడు బోగీలే ఉండడంతో ప్రయాణికులకు అవి ఏమాత్రం సరిపోవడం లేదు. అడుగుతీసి అడుగు వేయని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఎల్అండ్‌టీ యాజమాన్యం అదనపు కోచ్‌లు తీసుకొచ్చి ప్రయాణికుల ఇబ్బందులు తొలగిస్తామని రెండేళ్ల క్రితం హామీ ఇచ్చింది. ఆ తర్వాత 2024 నవంబర్ 28న అమీర్‌పేట్ మెట్రోస్టేషన్‌లో జరిగిన ఏడో వార్షికోత్సవ సమావేశంలో ఎల్అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి కొత్త కోచ్‌లపై స్పష్టమైన హామీ ఇచ్చారు. నాగ్‌పూర్, పుణే నుంచి అదనపు బోగీలను తీసుకొచ్చేందుకు రెండు సంవత్సరాలుగా ప్రయత్నిస్తున్నా.. అక్కడ రద్దీ కారణంగా అధికారులు లీజుకు ఇవ్వడంలేదని, ప్రస్తుతం బెంగళూరులోని భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (బీఈఎంఎల్)తో సంప్రదింపులు చేస్తున్నామని, ఏడాదిలోపు 4 నుంచి 7 కొత్త రైళ్లను (మూడు కోచ్‌లతో) కచ్చితంగా తీసుకొచ్చి ప్రయాణికులకు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు.

వర్షం వస్తే.. ఊపిరాడని పరిస్థితి..

నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో రోడ్లపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోతోంది. పలు సందర్భాల్లో కిలోమీటరు దూరానికి కూడా గంటన్నర నుంచి రెండు గంటల సమయం పడుతోంది. దీంతో పలువురు మెట్రోను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఆయా స్టేషన్లన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ప్లాట్‌ఫాం పైకి రైలు వచ్చిందే తడవు అన్నట్లుగా ఒకరినొకరు తోసుకుంటూ బోగీల్లో ఎక్కుతుండడంతో ఊపిరాడని పరిస్థితి నెలకొంటోంది. కొందరు పురుషులు.. మహిళలకు కేటాయించిన అరబోగీలోకి కూడా చొచ్చుకు వెళ్తుండడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

నగరంలోని మెట్రోస్టేషన్ల ప్లాట్‌ఫాంలను ఆరు కోచ్‌లు నిలిచే విధంగానే తొలుత నిర్మించారు. రైళ్లకు అదనపు బోగీలు తీసుకొచ్చి నడిపిస్తామని గతంలో ఎల్అండ్‌టీ ప్రకటించింది. ఆ తర్వాత 12-21 బోగీలు అందుబాటులో ఉండేలా 4 నుంచి 7 కొత్త రైళ్లను తీసుకొస్తామని కొన్ని నెలల క్రితం మళ్లీ ప్రకటించారు. ఈ ప్రతిపాదనలు తయారు చేసి ఏడాది దాటుతున్నా.. ఇప్పటివరకు అడుగు ముందుకుపడని పరిస్థితి నెలకొంది. కాగా, నష్టాల్లో ఉన్న మెట్రోను గట్టెక్కించేందుకు టికెట్ రేట్లు పెంచుకునేలా ప్రభుత్వం ఇటీవల అవకాశం కల్పించింది. చార్జీలు పెంచినప్పటికీ.. ప్రయాణికులకు కావాల్సిన కోచ్‌ల విషయాన్ని ఎల్అండ్‌టీ విస్మరిస్తుండడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదిగో, అదిగో అంటున్నారే తప్పా, బోగీలు పెంచడంలేదని మండిపడుతున్నారు. ఎల్అండ్‌టీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కోచ్‌లను త్వరగా తీసుకురావాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

భారీ వర్షాలతో పెరిగిన వర్షపాతం



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో గత వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాలతో హైదరాబాద్ జిల్లాలో అధిక వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లో జూన్ 1 నుంచి ఆగస్టు 8 వరకు హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా సాధారణంగా 323 మి.మీ.ల వర్షపాతం కురవాల్సి ఉండగా 376.5మి.మీ.ల వర్షం కురిసింది. ఇప్పటి వరకు సాధారణం కంటే 17 శాతం అదనపు వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో ఆగస్టు 8 నాటికి 279 మి.మీ.ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 380.1మి.మీ.ల వర్షం కురిసింది. సాధారణం కంటే ఇది 36శాతం అధికం. మేడ్చల్-మల్కాజిగిరిలో జిల్లాలో ఇప్పటివరకు 314.6మి.మీ.ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 334.4 మి.మీ.ల వర్షం కురిసింది.

హిమాయత్‌సాగర్ నాలుగు గేట్లు ఓపెన్

- 2,070క్యూసెక్కుల నీళ్లు మూసీలోకి విడుదల



హిమాయత్‌సాగర్ గేట్ల ద్వారా మూసీలోకి ప్రవాహం

నార్సింగ్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): హిమాయత్‌సాగర్ నాలుగు గేట్లను శుక్రవారం ఎత్తారు. 2,070 క్యూసెక్కుల నీటిని మూసీలోకి వదిలారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో హిమాయత్‌సాగర్‌కు రెండు రోజులుగా భారీగా వరద చేరుతోంది. ఈసీ వాగు ఉధృతంగా ప్రవహించి హిమాయత్‌సాగర్‌లో చేరుతోంది. పూర్తి స్థాయి నీటిమట్టానికి చేరడంతో గురువారం రాత్రి ఒక గేటును అడుగు మేర ఎత్తి 330 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. అయితే, శుక్రవారం తెల్లవారుజామున పడిన భారీ వర్షాలకు వెయ్యి క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో 4వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ఉదయం 9గంటలకు మరో రెండు గేట్లను ఎత్తారు. ఇన్‌ఫ్లో తగ్గకపోవడంతో 10గంటలకు మూడో గేటును, 11గంటలకు నాలుగో గేటును అడుగు మేర ఎత్తి నీటిని దిగువకు వదిలారు. దీంతో మూసీ పరీవాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు.

డేంజరస్ డెంగీ.. యాప్‌తో పర్యవేక్షణ

- బాధితుల ఇళ్లకు వైద్యాధికారులు/డీఈఈలు
- పరిసరాల ఫొటోలు, ఏఎల్ఓ, ఫాగింగ్ వివరాలు యాప్‌లో అప్‌లోడ్
- గ్రేటర్‌లో ఇప్పటి వరకు 595 డెంగీ కేసులు
- జూలై నుంచి కేసుల్లో భారీ పెరుగుదల
- ముందస్తు చర్యలకు బల్దియా శ్రీకారం



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో డెంగీ కేసుల నమోదుపై జీహెచ్ఎంసీ అప్రమత్తమైంది. వ్యాధి వ్యాప్తి నియంత్రణ చర్యలకు శ్రీకారం చుట్టింది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మెరుగైన పారిశుధ్య నిర్వహణ.. దోమల నివారణతోపాటు డెంగీ కేసులు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక ఫోకస్ పెడుతున్నారు. డెంగీ పాజిటివ్‌గా నమోదైన ప్రతి ఇంటినీ సహాయ వైద్యాధికారి(ఏఎంఓహెచ్)/డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ) స్థాయి అధికారి వెళ్లి తప్పనిసరిగా పరిశీలించాలని కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. దీంతో బాధితుడి ఆరోగ్య సమాచారం తెలుసుకుంటూ వారి ఇంటి పరిసరాలు ఎలా ఉన్నాయన్నది పరిశీలిస్తున్నారు.

మొబైల్ యాప్‌తో..

మాన్‌సూన్ నేపథ్యంలో దోమలు, ఇతర క్రిమికీటకాల వల్ల వ్యాప్తి చెందే వ్యాధుల నివారణపై జీహెచ్ఎంసీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ మేరకు మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో నమోదైన డెంగీ కేసుల వివరాలు వైద్యారోగ్య శాఖ ద్వారా ఎప్పటికప్పుడు జీహెచ్ఎంసీకి అందుతున్నాయి. ఈ సమాచారాన్ని అధికారులు మొబైల్‌యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఏఎంఓహెచ్ యాప్ ఓపెన్ చేయగానే వారి సర్కిల్‌లో ఉన్న డెంగీ కేసుల వివరాలు తెలుస్తాయి. చిరునామా ఆధారంగా అధికారులు వారి ఇంటికి వెళ్లాల్సి ఉంటుంది. డెంగీ బాధితుల ఇళ్లను సందర్శించి, ఇంటి పరిసరాల్లో పరిస్థితుల ఫొటోలు, ఏఎల్ఓ, ఫాగింగ్ ఎప్పుడు జరిగిందనే వివరాలను వారు మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతోన్న ఏఎల్ఓ, ఫాగింగ్ ఫొటోలను అక్షాంశం, రేఖాంశం ఆధారంగా ఎంటమాలజీ సిబ్బంది సంబంధిత గ్రూపులో పోస్టు చేస్తున్నారని ఓ అధికారి తెలిపారు. శేరిలింగంపల్లి, చార్మినార్, కూకట్‌పల్లి జోన్ల పరిధిలోని కొన్ని సర్కిళ్లలో ఏఎంఓహెచ్/డీఈలు కమిషనర్ ఆదేశాలు పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారులు గుర్తించారు. పనితీరు మార్చుకోకుంటే షోకాజ్

మిగతా 8వ పేజీలో..



మళ్లీ వాన

సరూర్‌నగర్‌లో అత్యధికంగా 7.8 సెం.మీలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాలపై వరణుడు మరోసారి ప్రతాపం చూపాడు. గంట వ్యవధిలో వాన దంచి కొట్టింది. శుక్రవారం ఉదయం నుంచి వాతావరణం పొడిగా ఉండగా.. రాత్రి 9గంటల సమయంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది. రాత్రి 11 గంటల వరకు సరూర్‌నగర్‌లో అత్యధికంగా 7.8 సెం.మీ.లు, బండ్లగూడలో 6.2, చంపాపేటలో 5.03, రియాసత్‌నగర్‌లో 4.7, లింగోజిగూడలో 3.1, బేగంబజార్‌లో 2.5 సెం.మీల వర్షపాతం నమోదైంది. దీంతో ఆయా ప్రాంతాల్లో రహదారులపై వరద నీరు నిలిచి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. శ్రావణ శుక్రవారం కావడం.. మహాలక్ష్మి పూజలకు హాజరయ్యే మహిళలు ఇబ్బందులు పడ్డారు. గురువారం వర్ష బీభత్సం నేపథ్యంలో ఆకాశం మేఘావృతం కావడంతో నగరవాసులు కొందరు అప్రమత్తమయ్యారు. బయటకు వచ్చిన వారు త్వరగా తమపనులు ముగించుకొని ఇళ్లకు వెళ్లేందుకు ఆసక్తి చూపారు. క్యుములోనింబస్ ప్రభావంతో రెండు, మూడు రోజుల పాటు నగరంలో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వర్గాలు చెబుతున్నాయి.





మాట్లాడుతున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో త్వరలో జరిగే ఉప ఎన్నికలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ ఎర్రగడ్డ కార్యకర్తలు, కూకట్‌పల్లి కార్పొరేటర్లతో శుక్రవారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై చర్చించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ నేతలకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. ప్రజలు మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు విసుగువచ్చిందని ఆయన ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ పార్టీ గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎర్రగడ్డ కార్యకర్తలు, కూకట్‌పల్లి కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● కార్పొరేటర్ సబీహా బేగం

అల్లాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అల్లాపూర్ కార్పొరేటర్ సబీహాబేగం సూచించారు. గురువారం కురిసిన వర్షానికి గాయత్రినగర్‌లో చెట్లు నెలకొరిగాయి. సఫ్దర్‌నగర్, పద్మావతినగర్, యూసూఫ్‌నగర్ లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సబీహా బేగం శుక్రవారం ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం వారికి సహకారం అందించాల్సిందిగా హైడ్రా మాన్‌సూన్ రెస్పాన్స్ టీంను కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ బలరాం, అబ్దుల్ హమీద్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమాటా 39, వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 40, బజ్జిమిర్చి 60, కాకరకాయ 26, బీరకాయ 35, క్యాబేజీ 13, బీన్స్ 60, క్యారెట్ 41, గోబిపువ్వు 20, దొండకాయ 28, చిక్కుడుకాయ 55, గోరు చిక్కుడు 28, బీట్‌రూట్ 23, క్యాప్సికం 47, ఆలుగడ్డ 23, కీర 23, దోసకాయ 15, సొరకాయ 15, పొట్లకాయ 18, కంద 40, ఉల్లిపొరక 40, ఉల్లిగడ్డ 20, మామిడి కాయ 15-20, అరటికాయ 10-11, చామగడ్డ 23, ముల్లంగి 6-8, చిలగడదుంప 35, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు 16-20, మునగకాయలు 5-6, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండుమిర్చి 160, అల్లం 100, వెల్లుల్లి 160, చింతపండు 160, పండుమిర్చి 80, ఉసిరి 85, కరివేపాకు 60, పర్వల్ రూ.60, పల్లికాయ 65, లోబా 23, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు శనివారం ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఒడిశాలో జరిగిన ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన క్రీడాకారుడు ఎండీ అహీల్ టైటిల్ సాధించాడు. ఫైనల్‌లో అహీల్ 7-5, 6-4తో నమన్ (కర్ణాటక)పై గెలిచి.. విజేతగా నిలిచాడు.

-హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి)



అనుబంధాల రాఖీ

● నేడే రక్షా బంధన్

● మార్కెట్‌లో మహిళల సందడి

కూకట్‌పల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అన్యోన్యమైన, అజరామరమైన అనుబంధం అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్లది. ఈ అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ. ఏటా శ్రావణ పౌర్ణమి రోజున రాఖీ పండుగ (రక్షాబంధన్) జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పౌర్ణమి వచ్చిందంటే చాలు అంతటా సందడి నెలకొంటుంది. ఆడపడుచులు ఎక్కడ ఉన్నా.. తమ సోదరుడి ఇంటికి వెళ్లి రాఖీలు కడతారు. దూర ప్రాంతంలో ఉన్నవారికి గతంలో పోస్టు ద్వారా రాఖీలు పంపేవారు. ఇప్పటికీ కొందరు కొరియర్ ద్వారా పంపిస్తున్నారు. శనివారం రాఖీ పండుగ సందర్భంగా కూకట్‌పల్లి అంతటా సందడి నెలకొంది. రాఖీలు, స్వీట్ల కొనుగోళ్లతో ఆయా దుకాణాలు కళకళలాడాయి. పలువురు రాఖీలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేశారు.



సోదరునికి రాఖీ కడుతున్న చిన్నారి

సందడిగా రాఖీ, మిఠాయి దుకాణాలు..

రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని కూకట్‌పల్లిలోని ప్రధాన రహదారులతో పాటు పలు కాలనీల్లోని దుకాణాల్లో వారం రోజులుగా రాఖీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. శుక్రవారం రాఖీ సెంటర్లు, మిఠాయి దుకాణాల వద్ద మహిళల సందడి కనిపించింది. మార్కెట్‌లో ఒక్కో రాఖీ రూ.10 మొదలుకుని రూ.500 వరకు ఉన్నాయి. ప్రత్యేకించి చిన్నారులను ఆకట్టుకోడానికి కార్టూన్ రాఖీలు అందుబాటులో ఉన్నాయి. మరికొందరూ వెండి రాఖీలను కొనుగోలు చేస్తున్నారు. అలాగే, మిఠాయి షాపులు కూడా సందడిగా మారాయి.



కూకట్‌పల్లిలో రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

రేపు సంక్షేమ సంఘం ఎన్నికలు

కేపీహెచ్‌బీకాలనీ/ అల్లాపూర్ ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ కాలనీలోని బాలాజీనగర్‌లో, అల్లాపూర్ డివిజన్ వి.రామారావునగర్ సంక్షేమ సంఘానికి ఎన్నికలు ఈ నెల 10న జరగనున్నాయి. బాలాజీనగర్ కాలనీ ఆవిర్భావం తర్వాత తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల ద్వారా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారని స్థానికులు తెలిపారు. బాలాజీనగర్‌లో అధ్యక్ష పదవికి ప్రతాప్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి ఇద్దరు పోటీ పడుతుండగా.. వి.రామారావునగర్‌లో అధ్యక్ష పదవికి నలుగురు పోటీ చేస్తున్నారు. వి.రామారావునగర్‌లో 525ఓట్లు ఉన్నట్టు సంఘం మాజీ అధ్యక్షుడు నాగుల సత్యం తెలిపారు. బాలాజీనగర్‌లో ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 వరకు, వి.రామారావునగర్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల దాకా పోలింగ్ నిర్వహించి, సాయంత్రం ఫలితాలు వెల్లడిస్తామని ఎన్నికల నిర్వాహకులు తెలిపారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

హైదర్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచించారు. వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్ల పరిధిలోని సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో జడ్సీ అపూర్వ్‌చౌహాన్, డీసీ గంగాధర్, కార్పొరేటర్ శ్రీనివాసరావుతో ఎమ్మెల్యే శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, కాలనీల్లోని పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు నిధుల మంజూరు కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తానని చెప్పారు. ఉషాముళ్లపూడి కమాన్ నుంచి సిక్కుల బస్తీ వరకు రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలు మార్చాలని అధికారులకు సూచించారు. బాగ్ అమీర్ పెట్రోల్ బంక్ నుంచి హైదర్‌నగర్ మహేంద్ర షోరూమ్ వరకు సర్వీస్‌రోడ్డును పునరుద్ధరించాలన్నారు. వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆయన సూచించారు. చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి పనులు, రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ఈ చిన్నారెడ్డి, ఈఈ గోవర్ధన్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ జీశాన్, విద్యుత్ అధికారులు మాణిక్యాలరావు, ప్రసాద్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ



దుర్గమ్మ ఆలయంలో పూజలు చేసేందుకు వచ్చిన మహిళలు

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

కూకట్‌పల్లి/ అల్లాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్, కూకట్‌పల్లిలో వరలక్ష్మీ వ్రతం వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. మహిళలు అమ్మవారి ఆలయాలకు చేరుకుని వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. అలాగే వారివారి స్వగృహాలలో అమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పసుపు బొట్టు, వాయినాలు ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకున్నారు. అలాగే, కూకట్‌పల్లి దుర్గామాత దేవాలయంలో అమ్మ వారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జలమండలి అధికారుల పర్యటన

అల్లాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్‌లో శుక్రవారం జలమండలి అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు. వర్షాలు పడుతున్న సమయంలో మ్యాన్‌హోల్ మూతలను తెరవకూడదని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జలమండలి కూకట్‌పల్లి డివిజన్ జనరల్ మేనేజర్ హరిశంకర్, గాయత్రినగర్ సెక్షన్ మేనేజర్ అన్వేత్ కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ కుంటలో అపరిశుభ్రత

● కార్పొరేటర్ శ్రీనివాసరావు అసహనం

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ కుంటలో అపరిశుభ్రత నెలకొనడంపై కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు అసహనం వ్యక్తం చేశారు. కేపీహెచ్‌బీ మూడోఫేజ్‌లోని బ్రహ్మంగారి ఆలయం ముందున్న బతుకమ్మ కుంటను కార్పొరేటర్ శుక్రవారం పరిశీలించారు. సంబంధిత అధికారులకు ఆయన ఫోన్ చేసి వెంటనే బతుకమ్మ కుంటను శుభ్రం చేయాలని సూచించారు. దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ చేయించారు. కార్పొరేటర్ వెంట ఎస్ఆర్‌పీ శ్రీనివాస్, ఎంటమాలజీ మహేందర్‌రెడ్డి, సుకన్య, రాజేశ్వరి ఉన్నారు.

ఏఎస్‌రాజునగర్‌లో నేలకొరిగిన భారీ వృక్షం

● తొలగించిన అధికారులు

హైదర్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ ఏఎస్‌రాజునగర్ కాలనీలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి భారీ వృక్షం నేలకూలింది. తక్షణమే స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు క్రేన్ తెప్పించి తొలగించారు. పనులను కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

● రూ.18 లక్షల బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

● వివరాలు వెల్లడించిన ఏసీపీ రవికిరణ్‌రెడ్డి

హైదర్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటి తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడుతున్న దొంగను కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేశారు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ రవికిరణ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడియంకు చెందిన కనపర్తి శివ(41) కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-9లో ఉంటూ ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. గత నెలలో ఇంటి పక్కన ఉండే వారి ఇంట్లో ఐదు తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసి ఏమి తెలియనట్లు నటించాడు. ఆభరణాల దొంగతనంపై వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కేపీహెచ్‌బీ కాలనీలో పోలీసులు గురువారం వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో శివ అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అతణ్ని అదుపులోకి తీసుకుని తమ సిబ్బంది విచారించారు. విచారణలో పలు ఇళ్లలో దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. అతని వద్ద 15 తులాల బంగారు ఆభరణాలు, 30తులాల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నామని, స్వాధీనం చేసుకున్న ఆభరణాల విలువ సుమారు రూ.18లక్షలు ఉంటుందని ఏసీపీ తెలిపారు. శివ బాచుపల్లి, మియాపూర్‌లలో రెండు చోరీలకు పాల్పడ్డాడని ఏసీపీ చెప్పారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, కానిస్టేబుళ్లను ఏసీపీ రవికిరణ్‌రెడ్డి అభినందించి రివార్డులు అందజేశారు.



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవికిరణ్‌రెడ్డి



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086

రహదారులపై పేరుకుపోయిన మట్టి తొలగింపు


శివాజీనగర్‌లో మట్టిని తొలగిస్తున్న సిబ్బంది

చందానగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు రోడ్లు దెబ్బతినగా, రహదారులపై పేరుకుపోయిన మట్టి, బురదను జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం శానిటేషన్ సిబ్బంది పలు ప్రాంతాల్లో రోడ్లను శుభ్రం చేశారు. కాగా, కొన్ని ప్రాంతాల్లో రహదారులు కంకర తేలి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఒడిశాలో జరిగిన ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన క్రీడాకారుడు ఎండీ అహీల్ టైటిల్ సాధించాడు. ఫైనల్‌లో అహీల్ 7-5, 6-4తో నమన్ (కర్ణాటక)పై గెలిచి విజేతగా నిలిచాడు.

- హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి)



భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

ఖేల్‌కాలనీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని ఆలయాల్లో వైభవంగా పూజలు నిర్వహించారు. భెల్ టౌన్‌షిప్, ఎంఐజీ కాలనీ, విద్యుత్ నగర్, పరిసర ప్రాంతాల్లోని ఆలయాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. భెల్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర, యోగేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలోని అన్ని ఆలయాల్లో విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించారు.

తారానగర్‌లో..

గచ్చిబౌలి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి తారానగర్ తుల్జాభవాని ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ నివాసంలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతం వేడుకల్లో సతీమణితో కలిసి కార్పొరేటర్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు.


కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ నివాసంలో నిర్వహించిన వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

రౌడీమూకలపై కఠిన చర్యలు తీసుకోవాలి

గచ్చిబౌలి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్‌లో నివసించే వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్న రౌడీలపై చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. రెండురోజుల క్రితం ఇక్కడ నివసించే రామకృష్ణ ఇంటిని ఖాళీ చేయాలంటూ భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు విచక్షణా రహితంగా దాడి చేశారని మండిపడ్డారు. శుక్రవారం రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించి ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రౌడీమూకలు ఇటీవలి కాలంలో పేట్రేగిపోతున్నారని, అమాయకులపై దాడులు చేస్తున్న వారిపై కఠిక చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

నేలకొరిగిన భారీ వృక్షం

హైదర్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఏఎస్‌రాజునగర్ కాలనీలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి భారీ వృక్షం నేలకూలింది. తక్షణమే స్పందించిన జీహెచ్‌ఎంసీ హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ అధికారులు క్రేన్ సహాయంతో దానిని తొలగించారు. ఈ పనులను కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పర్యవేక్షించారు.






అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్‌లో పారిశుధ్య పనుల తనిఖీ

హైదర్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ సూచించారు. శుక్రవారం హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలుకాలనీల్లో కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు, ఉప కమిషనర్ గంగాధర్, ఏఎంహెచ్‌ఓ శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర చేసి పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. ఇంటెన్సివ్ శానిటేషన్ డ్రైవ్‌లు, యాంటీలార్వా స్ప్రేయింగ్ ఆపరేషన్లు, సీజనల్ వ్యాధుల నివారణ వంటి పనులను క్షేత్రస్థాయిలో అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో నిర్వహించాలన్నారు. ఉషాముళ్లపూడి రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆయన సూచించారు.

జడ్సీతో సమావేశం..

వివేకానందనగర్, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ డివిజన్ల పరిధిలోని సమస్యలు, అభివృద్ధి పనులపై కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో జడ్సీ అపూర్వచౌహాన్, డీసీ గంగాధర్, కార్పొరేటర్ శ్రీనివాసరావుతో ఎమ్మెల్యే గాంధీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. పెండింగ్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, కొత్తగా చేపట్టాల్సిన పనులకు నిధులు మంజూరు చేయాలని జడ్సీని కోరారు. ఉషాముళ్లపూడి కమాన్ నుంచి సిక్కుల బస్తీ వరకు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎస్‌ఈ చిన్నారెడ్డి, ఈఈ గోవర్దన్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ జీశాన్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.





ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086

శ్రీకృష్ణానగర్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్‌తో స్థానికులు

షాపూర్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సూరారం డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్‌లో సుమారు రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, గత తొమ్మిది ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో డివిజన్‌లోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేశామన్నారు. రానున్న కా లంలో సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. కార్య క్రమంలో శ్రీకృష్ణానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దారం శివగుప్తా, మాజీ అధ్యక్షుడు బషీరుద్దీన్, స్థానికులు సత్యనారాయణగుప్తా, రైల్వే బషీర్, నిరంజన్, శినాయక్, సునీల్, లతా రెడ్డి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఇసుకతో ప్రమాదాలు



గాజుల రామారం డివిజన్ కమలమ్మనగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో వర్షాలకు పైనుంచి వస్తున్న వరద నీటితో ఇసుక మేట వేసింది. ద్విచక్ర వాహన దారులు ఇసుకలో జారి పడిపోతున్నారు. అధికారులు స్పందించి ఇసుకను త్వరగా తొలగించాలని వాహన దారులు, స్థానికులు కోరుతున్నారు.

- గాజులరామారం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) :

వాననీటితో మూడు కాలనీలకు రాకపోకలు బంద్



గాజులరామారం సర్కిల్ ఆదర్శనగర్, మాలక్ష్మీనగర్, మెట్టుకానిగూడలకు వెళ్లే రహదారి గురువారం కురిసిన కుండపోత వర్షానికి జలమయమై మోకాళ్ల లోతునీరు చేరింది. దీంతో ఆయా కాలనీలకు రాకపోకలు స్తంభించి జనం అవస్థలు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు యుద్ధ ప్రాతిపదికన రోడ్డుపై నీరును తొలగించేందుకు చర్యలు చేపట్టి రాకపోకలు పునర్ధరించాలని స్థానికులు కోరుతున్నారు -(షాపూర్‌నగర్, ఆంధ్రజ్యోతి)

పండగ సాయన్న జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

● ముదిరాజ్ సంఘం


సాయన్నకు నివాళులర్పించిన ముదిరాజ్ నాయకులు

గాజులరామారం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : పండగ సాయన్న పేద ప్రజల పక్షాన నిలబడి ఆధిపత్య వర్గాలపై యుద్ధం చేశారని ముదిరాజ్ సంఘం నాయకులు అన్నారు. సాయన్న జయంతి సందర్భంగా గాజులరామారం గ్రామ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో నిజాం రాజ్యంపై జరిగిన తిరుగుబాటు ఉద్యమంలో సాయన్న చేసిన పోరాటం ఒక చరిత్ర అని, బహుజనుల ఐక్యత, అభివృద్ధి ఎంతో ఆయన కృషి చేశారని కొనియాడారు. 38 ఏళ్ల ఆయన జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి రాబోయే తరాలకు ఆయన గొప్పతనాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు దొంతుల రమేష్, జర్నలిస్టు సంఘ జిల్లా అధ్యక్షుడు సుగ్రీవుడు, పాండు, రంగా, శివ, విష్ణువర్ధన్, కృష్ణయ్య, గోపాల్ పాల్గొన్నారు.

అనుబంధాల రాఖీ

● నేడు రక్షాబంధన్ ● జోరుగా రాఖీల విక్రయాలు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సోదర, సోదరీమణుల ప్రేమానుబంధాలకు ప్రతీక రాఖీ పౌర్ణమి లేదా రక్షాబంధన్. ప్రతియేటా శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి రోజున ఈ పండుగను జరుపుకుంటారు. ఈ రోజున అక్కాచెల్లెళ్లు తమ అన్నాదమ్ముళ్లకు రాఖీ కట్టి, మిఠాయిలు తినిపించి అంతా మంచి జరగాలని కోరుకుంటారు. సోదరులైతే తమ సోదరీమణులకు బహుమతులు అందజేసి జీవితాంతం కష్ట, సుఖాల్లో వెన్నంటి ఉండి రక్షిస్తామని ప్రమాణం చేస్తారు. ఈ పండుగ వెనుక అనేక పురాణ కథలున్నాయి. ఎవరికి తెలిసిన విధంగా వారు వాటిని నమ్ముతూ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. రాఖీ పండుగ వచ్చిందంటే చాలు మన సమీపంలో ఉండే వారే కాకుండా దేశ, విదేశాల్లో ఉండే సోదరీమణులు కూడా రక్షాబంధన్‌కు వారం రోజుల ముందు నుంచే ప్రణాళికలు వేసుకొని ఎన్నో వ్యయప్రయాసల కోర్చి తమ సోదరులకు రాఖీలు కట్టేందుకు వస్తుంటారు. కొందరు సోదరులైతే తమ సోదరికి ఇబ్బంది కల్గించడం ఇష్టం లేక వారే ఆమె ఇంటికి వెళ్లి రాఖీ కడుతుంటారు.

ఎలా వచ్చిందంటే..!

మహాభారతం ప్రకారం... శిశు పాలుడిని సంహరించిన తర్వాత శ్రీకృష్ణ భగవానుడి చేతికి తీవ్రగాయమై రక్తం కారుతుండగా ద్రౌపది తన చీర కొంగును చింపి శ్రీకృష్ణుడి చేతి గాయానికి కట్టు కడుతుంది. ఆ ప్రేమ, అనుబంధానికి మంత్ర ముగ్ధుడైన శ్రీకృష్ణుడు ఎల్లప్పుడూ ద్రౌపదిని రక్షిస్తానని ప్రమాణం చేస్తాడు. అప్పటి నుంచి శ్రావణ మాసం పౌర్ణమి రోజును రాఖీ పౌర్ణమిగా నిర్వహిస్తారని పెద్దలు చెబుతుంటారు.

● పురాణాల ప్రకారం... తన రాజ్యాన్ని వదిలిపెట్టి వైకుంఠానికి వెళ్లిపోవాలని శ్రీమహా విష్ణువును కోరుతాడని, అప్పుడు లక్ష్మీదేవి అతని చేతికి రాఖీ కట్టి, తన భర్తను తిరిగి పంపించమని కోరుతుంది. బలిచక్రవర్తి సోదరిగా ఆమె కోరికను మన్నించి విష్ణువును పంపించడంతో ఈరోజును రాఖీ పౌర్ణమిగా జరుపుకుంటారు.


మార్కెట్‌లో విక్రయిస్తున్న రాఖీలు


వెండితో తయారు చేసిన రాఖీ

నేడు (శనివారం) రాఖీ పండుగను ఘనంగా జరుపుకునేందుకు సోదరీమణులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. వ్యాపారులు మార్కెట్లలో వివిధ రకాల రాఖీలను విక్రయించేందుకు అందుబాటులో ఉంచారు. వీటి ధర రూ.2 నుంచి వేల రూపాయల వరకు ఉంది. కేవలం దూదితో మాత్రమే కాకుండా కొందరు వారి వారి స్థాయికి తగినట్లుగా వెండి, బంగారంతో చేసిన రాఖీలను కడతారు.

పోలీసులకు రాఖీలు కట్టిన విద్యార్థులు



సీఐ మల్లేష్‌కు రాఖీ కడుతున్న చిన్నారులు

జీడిమెట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): చిన్నచిన్న మనస్పర్థలతో విడిపోయిన సోదరుడు, సోదరీమణులు ఈ రాఖీ పండుగ ద్వారా కలుసుకుని ఆత్మీయతను పంచుకుంటారని జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేశ్ ఆశాభావం వ్యక్తంచేశారు. తమ అన్నాతమ్ముళ్లు దూరంగా ఉన్నారని, ఎవరికి రాఖీ కట్టాలో తెలియక బాధపడే వారు నిర్భయంగా జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తమ సిబ్బందికి రాఖీలు కట్టొచ్చని ఆయన తెలిపారు. శుక్రవారం సత్‌జ్ఞాన్ స్కూల్ విద్యార్థులు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పోలీస్ అధికారులకు, పోలీస్ సిబ్బందికి రాఖీలు కట్టి సోదర భావాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో సత్‌జ్ఞాన్ స్కూల్ డైరెక్టర్ చింతల మల్లేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాల పరిశీలన


భవనం వద్ద పత్రాలను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబరు 151, 179లో ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో తప్పుడు పత్రాలు, అక్రమ అనుమతులతో నిర్మించిన భవనాన్ని మేడ్చల్ ఇరిగేషన్ డీఈఈ ఉదయ్ భాస్కర్ సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. భవనం వద్ద చేపట్టిన పనులను నిలిపివేయాలని, నిర్మాణానికి సంబంధించిన అనుమతి పత్రాలను చూపించాలని శ్రీ షిరిడీ సాయి బిల్డర్స్ ప్రతినిధులకు డీఈఈ సూచించారు. ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో సర్వే నిర్వహించే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. కాగా, గురువారం బీజేపీ నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్ బృందం ఇచ్చిన ఫిర్యాదుకు స్పందించిన అధికారులు ఫాక్స్ సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మించిన భవనాలను పరిశీలించారు.

విద్యుత్‌శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి: సీపీఐ

జీడిమెట్ల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వీడి ప్రజలకు ఉత్తమ సేవలందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. గురువారం కురిసిన వర్షానికి జగద్గిరిగుట్టలోని రింగ్‌బస్తీ, సీసాలబస్తీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. స్థానికులు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి సమాచారం ఇచ్చినా స్పందించలేదన్నారు. సబ్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసిన వారిపై ప్రసాద్ అనే వ్యక్తి దురుసుగా ప్రవర్తించాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. మధ్యాహ్నం 12.30కి అయినా కూడా ఏఈ విధులకు హాజరు కాకపోవడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విధులపై నిర్లక్ష్యం చేస్తున్న జగద్గిరిగుట్ట సబ్‌స్టేషన్ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఉమామహేష్ కోరారు.

మెట్లపై నుంచి జారిపడి కార్పెంటర్ మృతి

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనం మెట్లపై నుంచి జారిపడి కార్పెంటర్ మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఎంఎన్‌రెడ్డినగర్ ఫేజ్-1లో వెంకట భానుప్రసాద్ అనే వ్యక్తి ఇంటిని నిర్మిస్తున్నాడు. ఇక్కడ కార్పెంటర్‌గా పనిచేస్తున్న వడ్లమణి వేణుగోపాల్‌రెడ్డి(58) శుక్రవారం భవనంపై నుంచి దిగుతూ మెట్లపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నూతన కమిటీ సభ్యులతో ఐలా అధికారులు

ఐలా నూతన కమిటీ ఎన్నిక

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్ర జ్యోతి): పారిశ్రామికాభివృద్ధికి కృషి చేస్తానని ఐలా నూతన చైర్మన్ పైడిపల్లి స్వామిగౌడ్ అన్నారు. శుక్రవా రం రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్ పారిశ్రామికవాడలో ఐలా నూతన కమిటీని పరిశ్రమల యజమానులు ఎన్నుకున్నారు. చైర్మన్‌గా స్వామిగౌడ్, వైస్‌చైర్మన్‌గా అఖిల్, సెక్రెటరీగా వి. రవీందర్‌రావు, జాయింట్ సెక్రెటరీగా టి. సుధాకర్, ట్రెజరర్‌గా శివకుమార్, సభ్యులుగా జగదీష్, శివార్జున్, సయ్యద్ బద్రుద్దీన్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి ప్రభాకర్, జెడ్ఎం అనూరాధ, కమిషనర్ స్రవంతి సమక్షంలో ఈ ఎన్నికలు జరిగాయి.

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జీడిమెట్ల డివిజన్‌లోని ముంపు ప్రాంతాల్లో శుక్రవారం జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు, రాజకీయ నాయకులు పర్యటించారు. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి పైప్‌లైన్ రోడ్డు, వెంకన్న హిల్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో నీరు చేరింది. దీంతో ఆయా ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ డీసీ నర్సింహ, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్ సింహారెడ్డిలు స్థానికులతో కలిసి పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా పైప్‌లైన్ రోడ్డులో మురుగు నీటి సమస్య తలెత్తకుండా నూతన పైప్‌లైన్‌ను వేస్తామని జలమండలి అధికారులు స్థానికులకు హామీ ఇచ్చారు. వెంకన్న హిల్స్‌లోని రోడ్లపై పేరుక పోయిన బురదను సిబ్బందితో కమిషనర్ నర్సింహ శుభ్రం చేయించారు. కార్యక్రమంలో అధికారులు ఈఈ గణేష్, ఏఈ అనురాగ్, ప్రభాకర్‌రెడ్డి, రమణారెడ్డి, మూర్తి, బోసుబాబు, మురళి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | పున్నారావు: 9985921366